శ్రీ మొదలి నాగభూషణశర్మ

# తెలుగు నవల : జాతీయోద్యమ ప్రభావం

"ప్రాచీన భారతదేశంలో జాతీయత" అన్న గ్రంథంలో ప్రొఫెసర్ రాధాకుముద్ ముఖర్జీ ఋగ్వేదకాలంనుంచీ భారతదేశంలో జాతీయతా భావం ఎలా ప్రజల జీవితాలను సంఘటితపరుస్తూ వచ్చిందో సోదాహరణంగా వివరించారు. ప్రకృతి శక్తులను ఆరాధించి, ఆవాహనంచేయడానికి ఉద్దేశింపబడ్డ ఋక్కులు, పృథ్వీమాతను ఆవాహనం చేయడానికి ఉపలక్షించిన పృథ్వీసూక్తం మొదలైనవన్నీ భారతదేశంలోని తరతరాల ప్రజల దేశభక్తికి తార్కాణంగా ఆయన ఉదాహరించారు.[1] కాని మధ్యయుగంలో మరుగున పడిపోయి, ఆధునిక కాలంలో తిరిగి తలమెత్తిన భారత జాతీయోద్యమానికి 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సమరంలోనే బీజారోపణం జరిగింది. ఆనాటినుంచి విద్యావంతులైన మేధావుల అధ్వర్యంలో జాతీయ మహాసభ (కాంగ్రెసు, 1885) ప్రారంభం అయ్యేవరకు ఆభావం చిగురిస్తూనే వచ్చింది. అంతేకాదు. ఆనాటినుంచి ఈనాటివరకు ఈజాతీయోద్యమం సాహిత్యాన్నంతనూ, ముఖ్యంగా నాటక నవలా సాహిత్యాలను ప్రభావితం చేస్తూనే ఉంది.[2]

ఏ ఉద్యమమైనా సాహిత్యం మీద తన ప్రభావాన్ని రెండువిధాలుగా ప్రసరింపచేస్తుంది. ఒకటి ప్రత్యక్ష ప్రభావం: ఉద్యమం జరుగుతూ ఉండగా, ఆ ఉద్యమ విశేషాలను, దాని ప్రాముఖ్యాన్ని, ఎప్పటికప్పుడు ప్రజలకు చూపుతూ వ్రాయడం, ఉద్యమంలో పాల్గొన్న వారినే తమ రచనలలో పాత్రలుగా స్వీకరించడం ప్రత్యక్ష ప్రభావానికి ఉదాహరణలు. ఆ ఉద్యమం సంఘం మీద, లేదా కొందరు వ్యక్తులమీద ఎటువంటి ప్రభావాన్ని కలుగ చేసిందో చూపడం పరోక్ష ప్రభావానికి నిదర్శనం. తెలుగు సాహిత్యంలో ప్రతిబింబించిన భారత జాతీయోద్యమాన్ని పరిశీలిస్తే, ప్రత్యక్ష ప్రభావం కల రచనలు ఎక్కువగా నాటకాలలోను (వీనినే రాజకీయ నాటకాలు అనవచ్చు), పరోక్ష ప్రభావం గల రచనలు నవలలలోను మనకు కనిపిస్తాయి.

తెలుగులో వచ్చిన జాతీయభావ స్ఫోరకాలైన నవలలన్నీ పరోక్షప్రభావితాలేనని చెప్పవచ్చు. కాని వీనిలో కూడ ఎంతో భిన్నత్వం మనకు గోచరిస్తుంది. కొన్ని నవలలు జాతీయోద్యమాన్ని వర్ణించి, అందులో పాల్గొన్న కొందరువ్యక్తుల జీవితాలను ఆలంబనంగా గ్రహించి వ్రాయబడ్డవి. మరికొన్ని ఆ ఉద్యమ నిర్వహణంలో ప్రముఖ సూత్రాలుగా వెలువడ్డ అస్పృశ్యతానివారణ, గ్రామ పునరుద్ధరణము వంటి సమస్యలను చిత్రించినవి.

గాంధీజీ తన అసహాయోద్యమాన్ని ప్రారంభించక ముందే ఎందరో రచయితలు జాతీయతాభావాన్ని తమ రచనలలో పొందుపరచారు. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభమైన తొలిరోజుల్లో ఈభావం ఇంకా విస్పష్టంగా రచనలలో తొంగి చూసింది. పందొమ్మిదవ శతాబ్దం చివరి రోజులలో

1. Prof. Radha Kumud Mukherjee, "Nationalism in Ancient India", పుటలు 14,27-28,42.

2. కావ్యాలలోను, ఖండకావ్యాలలోను ఈ నాడు జాతీయోద్యమ ప్రభావం అంతగా కనిపించడంలేదు. నవలలో ఇది ఎక్కువగా కనిపించడానికి కారణం ఆజాతీయోద్యమాన్ని తమ కథలకు పృష్ఠభూమి (back ground) గా స్వీకరించిన చాలమంది నవలాకారులు ఉండడమే.

రచయితలు జాతీయతా భావాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించడానికి వెనుకాడి దానిని పౌరాణిక, చారిత్రక గాథలద్వారా పరోక్షంగా వెలువరించారు. రామరావణ యుద్ధాన్ని, కురుపాండవుల యుద్ధాన్ని ప్రాతిపదికగా స్వీకరించి, మంచిని భారతజాతి గాను, దుర్మార్గాన్ని బ్రిటిష్ పరిపాలన గాను అన్యాపదేశంగా చూపారు. అలానే భారతదేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికి కంకణం కట్టు కొన్న రాణాప్రతాప్, శివాజీల వంటి వీరులకథలు కూడా పరోక్షంగా ఇట్టి జాతీయతాభావానికే ప్రోద్బలకాలైనాయి.

నవలాసాహిత్య చరిత్రను గమనిస్తే 1915 నాటికే ఈ చారిత్రక నవలలు పాఠకుల మన్నన లను పొందాయని స్పష్టమవుతుంది. ఇందులో కొన్ని స్వతంత్రాలు, చాలవరకు అనువాదాలు. ఇట్టి నవలలను వెలువరించి భారతజాతీయోద్యమాన్ని, ఆంధ్రోద్యమాన్ని తెలుగుదేశం నలుమూలలా విస్తరింప చేసిన ఖ్యాతి ఆంధ్రప్రచారిణీ గ్రంథ మాలను స్థాపించిన వెంకటపార్వతీశ్వరకవులది. వారు స్వయంగా ఇట్టినవలలు వ్రాయడమేకాక, తమ గ్రంథమాలలో ఇట్టి చారిత్రక నవలలను ప్రచురించి జాతీయోద్యమ భావానికి తెలుగు సాహిత్యంలో మేలుకొలుపులు పాడారు.

గాంధీజీ భారత రాజకీయ రంగంమీదికి రాక మునుపే తెలుగు నవలాకారులు, సంస్కర్తలు పంచముల ఉద్ధరణను గురించి ఎంతో శ్రద్ధ వహిం చారు. శ్రీ తల్లాప్రగడ సూర్య నారాయణమూర్తి గారు వ్రాసిన "హేలావతి" (9-5-1913 నాడు వెలువడ్డది) తెలుగులో అస్పృశ్యతా సమస్యమీద వ్రాయబడిన తొలినవల. దీనిలో శ్రీమూర్తిగారు అస్పృశ్యులని దూరంగా ఉంచుతూ వచ్చిన పంచములు మిగిలిన కులాలవారికి ఏవిధంగానూ తీసిపోరన్న సత్యాన్ని వెలువరించారు. వేంకట పార్వతీశ్వరకవులు 1918లో వ్రాసి ప్రచురించిన "మాతృ మందిరము" అన్న నవల ఈనాటివరకు కూడా ఆసమస్యపై వచ్చిన ఉత్తమమైన నవలలలో ఒకటి. 1920 లో వచ్చిన వేలూరి శివరామశాస్త్రి గారి "అహోబలీయము" అన్ననవలిక ('ఓబయ్య' అన్న పేరుతో 'భారతి'లో వెలువడ్డది) జాతీ యోద్యమంలోని బాగోగులను చర్చించిన మొట్ట మొదటి నవల.

తెలుగు నాటక సాహిత్యంలో వచ్చినంత రాజ కీయసాహిత్యం నవలలలో రాలేదనే చెప్పాలి. నాట కాలు ప్రదర్శింపబడి, మారుమూలల ఉన్న చదువు లేనివారిని కూడా కదిలించగలవి కావడంవల్ల తెలుగులో ప్రచారనాటకాలు ఎక్కువ. నవలలలో సిద్ధాంత ప్రతిపాదన పరమైనవో, లేదా ఉద్యమం ఆనాటి వారిపై కలిగించిన ప్రభావాన్ని తెలియ చెప్పేవో ఉన్నాయి కాని రాజకీయ నవలలు లేవు.

అయినా, తెలుగు నవలా రచయితల్లో ప్రఖ్యాతు లందరూ ఏదోవిధంగా గాంధీజీప్రభావానికి లోనైన వారే! ఎక్కడో ఒకచోట - తమ నవలలలో - గాంధీజీని గురించి, దేశంలో ఆయన సాగించిన ఉద్యమాన్ని గురించి గ్రంథస్థం చేసినవారే![3] ఇలా జాతీయోద్యమం వల్ల ప్రభావితమైన నవలలలో ఉన్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి", విశ్వ నాథవారి "వేయిపడగలు", అడవి బాపిరాజుగారి "నారాయణరావు", "కోనంగి", బుచ్చిబాబు "చివ రకు మిగిలేది", కొడవటిగంటి కుటుంబరావు "చదువు", మహీధర రామమోహనరావు "కొల్లాయి గట్టితే నేమి", ముప్పాళ్ళ రంగనాయకమ్మ "బలి పీఠం" ముఖ్యమైనవి. ఇవికాక ఇంకా ఎన్నో నవ లల్లో ఈ విషయం ప్రస్తావించబడ్డది. అందులో కొన్ని నవలలను గురించి ఇక్కడ పరామర్శించడం జరుగుతుంది.

1920కి పూర్వమే బంకించంద్ర చటర్జీ నవ

3. ఇట్టివారిలో చెళ్ళపిళ్ళ, శ్రీపాద కృష్ణమూర్తిగార్ల దగ్గరనుండి అతినవీనుల వరకు ఈ ఉద్యమాన్ని గురించి, ఈ ఉద్యమనాయకుడైన గాంధీజీని గురించి ప్రశంసలు చేసినవారే।

లలు కొన్ని తెలుగులోనికి అనువదించబడి ఈ జాతీయతా భావానికి అంకురార్పణ చేశాయి. తరువాత పేర్కొనదగిన నవల వెంకటపార్వతీశ్వరకవుల "మాతృమందిరము." ఈ నవలలో సంఘ దురాచారాలను గురించిన విమర్శ, సంస్కరణాభిలాష చూపబడ్డాయి. తరువాత తరువాత జాతీయోద్యమంలో ఒక భాగంగా పరిగణించబడ్డ అస్పృశ్యతా నివారణనుగురించి ఈనవల చాలా విప్లవాత్మకమైన అభిప్రాయాలను వెల్లడించింది (ఆనాటి దృష్ట్యా). బ్రాహ్మణ కుమారుడని తెలిసిన తరువాత కూడా రంగన్న - కడజాతివాని కుమార్తె ముత్యాలును వివాహమాడటం అన్న సంఘటనను ఇంత విస్పష్టంగా ఆనాడు చూపడానికి ఎంతో ధైర్యం అవసరం అయివుండాలి.

జాతీయ సాహిత్యంలో "మాలపల్లి" మణిపూస వంటిదని చెప్పవచ్చు. ఉన్నవ లక్ష్మినారాయణ గారు "సుప్రసిద్ధాంధ్ర నాయకులు, సంస్కర్తలు, సాహిత్యవిశారదులు, కార్యశూరులు."[4] ఈ నవలలో ఉన్నవవారు అస్పృశ్యతా నివారణను, హరిజనోద్యమాన్ని ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించారు. "ఉన్నవ లక్ష్మినారాయణగారు మాలపల్లి యందు సంకల్పించిన నవజీవన నిర్మాణవిధానము లాంధ్ర సాహిత్య సంస్కారమునందు నూతనాధ్యాయములు"[5] అన్నారు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు.

ఈ నవలను రామదాసు 'ఆత్మోద్ధరణము' అనవచ్చు. పెరిగిన పంటచేనును చూసుకొని మురిసిపోతున్న రామదాసుతో నవల ప్రారంభమై ఆయన మౌనిగా, యతీంద్రుడుగా రూపొందటంతో అంతమవుతుంది. భౌతికమైన సంపదనుండి కష్టాల సంక్లిష్టమార్గం గుండా ఆధ్యాత్మికమైన సంపదను పొందడానికి ప్రతిమానవుడు సాగించేయాత్ర రామదాసు జీవితమని చెప్పవచ్చు. రామదాసు గొప్పతనాన్ని చూపడానికి—చిన్నకులాల వారి గొప్పతనంతోపాటు పెద్దకులాలవారి చిన్నతనం కూడా విస్పష్టంగా చూపారు రచయిత.

'మాలపల్లి'కి 'సంగవిజయము'అన్నది నామాంతరం. సంగదాసు ఈ నవల మొదటిభాగంలోనే మరణించినా అతడు నిజంగా జీవించటం మొదలుపెట్టింది ఆ తరువాతనే. విజయకళాశాల స్థాపన, దిగువజాతుల విద్యాసముపార్జనకు అవకాశం, పంచములను కూడ గౌరవంగా చూడటం—ఇవి అన్నీ సంగదాసు ఆశయాల పరిపక్వరూపమే. రామదాసు దిగువకులాలవారి ఆధ్యాత్మిక సంపత్తికి ప్రతీక అయితే సంగదాసు వారి మేధాసంపత్తికి ప్రతీక అని చెప్పవచ్చు.

ఈ నవలలో రామదాసు, సంగదాసు, రామానాయడు అహింసా సిద్ధాంతం మూర్తికట్టినవారు. వీరి పాత్రలను చిత్రించటంలోను, హరిజనోద్యమ విజయాన్ని చూపటంలోను ఉన్నవవారు జాతీయోద్యమ సిద్ధాంతాలనే స్వీకరించినా ఈ నవల ఆద్యంతమూ ఎక్కడా మనకు ఆ ఉద్యమనేత అయిన గాంధీజీ పేరుకాని, ఆయన సారథ్యం వహించిన కాంగ్రెసు పేరుకాని, ఆ కాంగ్రెసు నడిపిన జాతీయోద్యమం పేరుకాని కానరావు. అందువల్లనే మాలపల్లి కేవలం వస్త్వాశ్రయ పద్ధతిలో ఒక వర్గంవారి జీవితాన్ని చిత్రించిన అద్వితీయమైన నవలగానే పరిగణింపబడుతుంది.

"వేయిపడగలు" విశ్వనాథ సర్వోత్కృష్టమైన రచన. ఈ శతాబ్దంలోని మొదటి రెండు, మూడు దశాబ్దులలో తెలుగువారి జీవనగతుల్లో వచ్చిన మార్పును విశ్వనాథవారు ఇందులో చిత్రించారు. ఈ రెండుమూడు దశాబ్దుల కాలాన్ని చిత్రించదలుచుకొన్నవారెవ్వరూ జాతీయోద్యమ భావాన్ని, ఆ ఉద్యమ స్థితిగతులను పేర్కొనకుండా ఉండడానికి వీలులేదు.

4. మాలపల్లికి శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుగారు వ్రాసిన పీఠిక, "తొలిపలుకు", పుట xviii.
5. ఆదే: "తొలిపలుకు", పుట ix.

'వేయిపడగలు'లో కనీసం ముగ్గురు పాత్రలు జాతీయోద్యమంలో మునిగితేలినవారు: సుబ్బన్న పేటలో జాతీయ కళాశాలను స్థాపించిన కేశవరావు, ధర్మారావుస్నేహితుడు రాఘవరావు ఆ ఉద్యమం వల్ల ప్రత్యక్షంగా ప్రభావితులైనవారు. ఇక ధర్మారావు— ఆ ఉద్యమం అంటే అభినివేశం ఉండి అర్థికమైన కారణాలవల్ల దాని సిద్ధాంతాలను ఆమోదించినవాడు.

కేశవరావుగారు జాతీయభావాలకు ఆలవాలమై ఉండే కళాశాలస్థాపనకు పడిన మథన, దానిని నిర్వహించడానికి పడిన పాట్లు ఆనాటి విద్యావిధానాన్ని తెలియచెబుతాయి. ఇక రాఘవరావు మద్యపాన నిషేధంవంటి దురాచారాలను మాన్పడానికి పడిన శ్రమ ఆ జాతీయోద్యమ కార్యకర్తలకు తగినదే! తుదకు రాఘవరావు తన సర్వస్వాన్నీ, చివరకు తన దేహదార్ఢ్యాన్నికూడా ఈ జాతీయోద్యమానికే ధారపోయడం చూస్తే, నిస్వార్థకాములై ఆనాడు తమ ధన, మాన, ప్రాణాలనుకూడా లెక్కించక జాతీయోద్యమంలోకి దూకిన ఎందరో యోధులు జ్ఞాపకం వస్తారు.

వీనికన్న ఎక్కువగా, విశ్వనాథ ఆనాడు గాంధీజీ యెడ, ఆయన ప్రారంభించిన జాతీయోద్యమం యెడ వెలువరించిన భావాలు ఎంతో సత్యాలు.

"అప్పటికి మహాత్ముడైన గాంధి సహాయ నిరాకరణోద్యమమారంభించి రెండేండ్లయినది. జనులు గాంధి దేవుడై యవతరించె నన్నారు. ఆయనే కృష్ణుడు. రాటమే వేణువు. తన్మధురధ్వని వంశీ నాదము. భారతదేశము బృందావనము. ప్రజలు గోపికలై యాయన చెప్పినట్లే కోట్లకుగోట్లు జనులు గుమిగూడి యవలంబించ జొచ్చిరి, దేశమునం దింగ్లీషు చదువన్నను పాశ్చాత్య సంప్రదాయానుసరణ మన్నను నిరాదరణ కలిగెను."[6]

అడవి బాపిరాజుగారు జాతీయోద్యమ ప్రచండతకు వివశితులై, బందరులోని జాతీయకళాశాలలో అధ్యాపకవృత్తి నెరపినవారు. ఆయనకు గాంధీజీ అన్నా, ఆయన అహింసా సిద్ధాంతమన్నా, జాతీయ భావ నిష్ఠమైన ఏ వ్యవహారమన్నా ఎంతో ప్రాణం. ఆయన "నారాయణరావు," "కోనంగి" అన్న నవలలలో జాతీయోద్యమ విశేషాలు వివరంగా వర్ణించబడ్డాయి. కాంగ్రెసు ప్రారంభించిన ఉద్యమాలలోని ఉత్కృష్టతను గురించి, వీగిలిన పార్టీలలోని లోపాలనుగురించి ఆయన తన నవలలోని ప్రధాన పాత్రలద్వారా చాలా సంభాషణలలో ఉపన్యాసాలు చెప్పించారు.

నారాయణరావు గాంధీగారి పిలుపు విని కాలేజీ వదలి దేశంకోసం ఖైదుకు వెళ్ళినవాడే! అలాగే కోనంగికూడా. ఈ అసహాయోద్యమంయొక్క ఉత్సాహం స్త్రీలలోకూడా అమితంగా ఉండడాన్ని చూపారు బాపిరాజు. "కోనంగి"లో అనంతలక్ష్మి, "నారాయణరావు"లో శారద అక్కగారు శకుంతల ఇటువంటివారు.

"నువ్వు అదృష్టవంతురాలవు కాబట్టి నీకు నాన్ కోఆపరేషన్ భర్తదొరికాడు" అంటుంది శకుంతల, చెల్లెలు శారదతో.

ఇక కోనంగికి చిన్నతనంనుంచీ "కాంగ్రెసు మహాసంస్థ అనీ, కాంగ్రెసు నాయకుడైన మహాత్మా గాంధీ లోకనాయకుడనీ నమ్మకం. రానురాను అతడు కాంగ్రెసులో సభ్యుడై, అది చేపట్టిన అన్ని ఉద్యమాలలోను ముందుకు ఉరికాడు.

కోనంగి సమకాలికమైన ఉద్యమాలను తలచుకొన్నప్పుడల్లా బాపిరాజు ఆనాటి సర్వ విషయాలను వర్ణిస్తారు. 1925-40ల మధ్య వచ్చిన అన్ని రాజకీయ ఉద్యమాలను, పరిణామాలను కోనంగి ద్వారా చెప్పిస్తారు. చివరకు కోనంగి క్విట్ ఇండియా ఉద్యమంలోపాల్గొని జైలుకుపోతాడు. ఇలా ఆనాటి అన్ని ఉద్యమాలను వివరంగావర్ణించాడు బాపిరాజు.

6. "వేయిపడగలు" - పదునాకండవ అధ్యాయము మొదట.

ఈనవల అంతటా కోనంగికి ఆనాటి రాజకీయ జీవితానికి ఉన్న సంబంధం చూపబడ్డది ఉత్సాహవంతుడైన ఉద్యమ కార్యకర్తగా, జైలు నివాసిగా, సంపాదకునిగా అతని అనుభవాలే ఇందులో వర్ణింపబడ్డాయి. నిజానికి ఇవిఅన్నీ బాపిరాజుగారి స్వానుభవాలే!

జీవితం మీద ఒక దృక్పథాన్ని కలగచేయాలన్న ఉద్దేశ్యంతో సాగిన నవల బుచ్చిబాబు "చివరకు మిగిలేది." ఈ దృక్పథాన్ని కలగచేయడానికి రచయిత దయానిధి పాత్రను స్వీకరిస్తారు.

దయానిధి జీవితంలో వచ్చిన పెద్ద మలుపు అతని శోభనంనాటిరాత్రి కాంగ్రెసు సభలోమాట్లాడి, అరెస్టుకాబోయి, మామగారు పోలీసు ఆఫీసరయినందువల్ల బయటపడటం. దయానిధిలో వచ్చిన రాజకీయ చైతన్యానికి ఇది దోహదం చేస్తుంది.

దయానిధి అత్తవారింటికి వచ్చారు. ఆ రాత్రి భోజనం చేశారు. ఇంకా కొద్దిసేపట్లో భార్యాభర్తలు ఒకటౌతారు. "ఐదు నిముషాల్లోనే భారతమాత సంకెళ్ళని చప్పుడు చేస్తూ అతనిఏకాంతాన్ని భంగం చేసింది." ఆ సంకెళ్ళ చప్పుడుకు చలించిన దయానిధి కదనరంగంలోకి దూకుతాడు. ఇది 1935 లో.

గాంధీజీ ("ఒకసన్నటి నల్లటి పొడుగాటాయన") సాగించిన ఉద్ధృతమైన ఉద్యమం, అందులో ప్రజలు రేణువులై పోవడాన్ని ఎంతో నిశితంగా వర్ణించాడు బుచ్చిబాబు. తానుప్రేక్షకుడుగా మాత్రమే ఉపన్యాస వేదిక దగ్గరకు వస్తానన్న దయానిధి, తీరా దగ్గరకు వచ్చాక తన ఉద్రేకాన్ని ఆపుకోలేకపోతాడు. ఆ ఉద్రేకం ఎటువంటిది? "శరీరం పొంగింది. చర్మం విప్పుకుని వెంట్రుకలు నిలబడి గుండెలు దడదడ కొట్టుకుంటూ రక్తం వేడెక్కి-వేగంగా ప్రవహిస్తూ, అతన్ని నరాలకుప్పగామార్చి వేశాయి. అతనిక మనిషికాడు. ఒక శక్తి."[7]

ఇది ఆనాడు ఉద్రేకపూరితుడైన ప్రతికార్యకర్తకు నిర్వచనంగా చెప్పుకోవచ్చు.

ఈ నవలలో రెండు ప్రపంచ సంగ్రామాల మధ్యకాలంలో ఒకవైపు బ్రిటిష్‌వారి తాబేదార్లకూ వేరొకవైపు స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించే యువతీయువకులకూ మధ్య జరిగిన సంఘర్షణ ఎంతో ప్రతిభావంతంగా చిత్రించబడ్డది.

కొడవటిగంటి కుటుంబరావుగారు వ్రాసిన చాలా నవలలకు 1920-40ల మధ్యకాలాన్ని పృష్ఠభూమిగా స్వీకరించారు. ఆనాటి జీవితాన్ని వర్ణించాలంటే జాతీయోద్యమాన్ని వర్ణించి తీరవలసిందే. కుటుంబరావుగారి చాలా నవలలలో ఈ ప్రస్తావన ఉన్నా, ముఖ్యంగా ఆయన "చదువు" అన్న నవలలో ఆ జాతీయోద్యమం వల్ల ప్రభావితమైన ఒక కుటుంబజీవితం చిత్రించబడ్డది.

ఆనాడు స్వదేశోద్యమంలో జరిగిన ఎన్నోకార్యక్రమాలకు ఈ నవలలో నాయకుడు సుందరం కేవలం ప్రేక్షకుడు మాత్రమే. కాని అతని మేనమామ శేషగిరి ఉద్యోగం మాని ఉద్యమంలో చేరడంతో ఆ ఉద్యమ విశేషాలు చాలా స్పష్టంగా తెలిసి వస్తాయి సుందరానికి.

"ఇంకా అస్పృశ్యత ఏమిటి? అంతా గాంధీమయం అయిపోతుంటేను-? జగమంతా గాంధీమయం" అంటాడు శేషగిరి. దీనివలన ప్రభావితుడైన సుందరం కాలేజీలో చేరాక కాంగ్రెసు సభలకు వెళ్ళాడు. ఉప్పు సత్యాగ్రహంలో దేశం అట్టుడికినట్టు ఉడికిపోవడం సుందరానికి తెలుసు. ఇలా సుందరానికి చుట్టూ ఉన్న జీవితంలో ఆనాడు దేశవ్యాప్తంగా జరిగిన అనేక జాతీయోద్యమాల ప్రభావం ఎలా పడ్డదీ వివరంగా చూపుతుంది ఈ నవల. ముఖ్యంగా ఇన్ని ఎగుడు దిగుడుల్లోను నిజంగా తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన శేషగిరి వంటి వ్యక్తుల జీవితాలనుగురించి ఇంకా స్పష్టంగా విశదీకరిస్తుంది "చదువు".

7. "చివరకు మిగిలేది" - చప్పుడు చెయ్యని సంకెళ్ళు, పుట 241.

మహీధర రామమోహనరావుగారి "కొల్లాయి గట్టితే నేమి" అన్న నవల 1921 లో దేశాన్ని ఉర్రూతలూగించిన గాంధీజీ ఉద్యమాలను గురించిన రచన. కార్యస్థానం గోదావరి జిల్లాలోని ముంగండ. ఆనాటిరాజకీయ జీవితాన్ని చిత్రించడం ఈ నవల ధ్యేయం. ఆనాడు సంఘాన్ని కదలించి వేసిన అన్ని కార్యక్రమాలు ఇందులో సవివరంగా వర్ణించ బడ్డాయి.

ఈ నవలకు రచయిత ఉంచిన పేరునుబట్టి ఇది గాంధీజీ ప్రభావాన్ని చిత్రించే నవలగా మనం ఊహించవచ్చు. గాంధీజీ ఆదేశంప్రకారం కాలేజి చదువులు మానిన ఒక విద్యార్థి కథ ఇది. అలా కాలేజి చదువులు మానడంలోగల ఇబ్బందులు, చుట్టపక్కాలు చూపే నిరసన ఇందులో వాస్తవికంగా చిత్రించబడ్డాయి. ఒకగ్రామాన్ని కేంద్రస్థానంగా స్వీకరించి, దానిలోని విభిన్నవ్యక్తుల్ని—ముఖ్యంగా భారతజాతీయోద్యమం అంటే వారికివున్న విభిన్న మనస్తత్వాల్ని - ప్రకటించి 1921 లో జాతీయోద్యమం ఒక అగ్రహారంలోని ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేసిందీ చూపే నవల ఇది.

హరిజన సమస్యను గరించీ, కులాంతర వివాహాలను గురించీ వ్రాయబడిన నవలల్లో "బలి పీఠం" ఎన్నికచేయ తగ్గది. వర్ణాంతర వివాహం చేసుకొన్న వారిజీవితాలు ఎలా నడుస్తాయో చూపి, "కులాల ఆధిక్యత" అర్థంలేని సిద్ధాంతం అని రచయిత్రి శ్రీమతి ముప్పాళ్ల రంగనాయకమ్మ ఈ నవలలో ప్రతిపాదించింది. ఇందులో పరిచయంచేసిన "కరుణసమాజం", ఆ ఆశ్రమ సిద్ధాంతాలు గాంధీజీ ఆశ్రమ సిద్ధాతాలను జ్ఞప్తికి తెస్తాయి.

ఈ పైనపేర్కొన్న నవలలు కాక ఇటీవల వెలువడిన ఇంకా ఎన్నో నవలలు జాతీ యోద్యమ ప్రభావాన్ని చిత్రించడానికి ప్రయత్నించాయి. శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తివ్రాసిన'కౌసల్య' లో కౌసల్యభర్త శోభనంనాటిరాత్రే జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెడతారు. ఒక కుటుంబాన్ని ఈ జాతీయోద్యమం ఎలా ప్రభావితం చేసిందో, అందులోని విభిన్న వ్యక్తులు దానిని ఎలా వేరువేరు దృక్పథాలతో దర్శిందారో చూపుతుంది "కౌసల్య".

సుమలత వ్రాసిన "జీవనకలశం"లో నాయిక వసంతలక్ష్మి తనకు ఇష్టంలేని భర్తను వదలి గాంధీజీని వార్ధాలో దర్శించి, ఆయన ప్రాపున నాగపూరులో చదువుకొని తనకు నచ్చినవాడిని వివాహమాడుతుంది. ఇటీవలనే వెలువడ్డ "రాజరికాలు-పేదరికాలు" అన్న నవలలో ఫ్యూడల్ పద్ధతులకు చెందిన జమీందారుల కుటుంబంలో జాతీయ భావాలు పెంపొందించుకొన్న ఒక యువకుడు, అతనిభార్య పడే కష్టాలు వర్ణించబడ్డాయి.

అలానే శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన "విజేత"లో సత్యాగ్రహోద్యమ ప్రసక్తి ఉంది.

స్వాతంత్ర్యానంతరం వచ్చిన కవితలలో వలెనే నవలలలో కూడా జాతీయోద్యమంలో త్యాగాలు చేసిన నాయకుల పవిత్రత, ధర్మదీక్షలకు ప్రతిగా ఈనాటి అధర్మము, నీచత్వము చూపబడ్డాయి. ఇవి అన్నీ వ్యంగ్యాత్మక మైనవి. ఇట్టి నవలల్లో శ్రీ జి. వి. కృష్ణారావు వ్రాసిన "కీలుబొమ్మలు" ఎన్నదగిన రచన. ఈ నవలలో అమ్మాయమ్మ స్వార్థప్రయోజనాలకు హరిజనసేవ అన్న నినాదాన్ని ఎలా ఉపయోగించుకొన్నదో ఎంతో వ్యంగ్యంగా చిత్రించ బడ్డది

ఇలా వందలాది నవలలు జాతీయోద్యమాన్ని ఏదోవిధంగా వర్ణించాయి. ఇలావర్ణించిన నవలలను మూడు కక్షలకు చెందినవిగా క్రోడీకరించవచ్చు. ఒకరకం నవలలు జాతీయోద్యమాన్ని, ఆనాటి వ్యక్తులమీద అది చూపిన ప్రభావాన్ని చిత్రించేవి. అట్టివానిలో వేయిపడగలు, నారాయణరావు,కోనంగి, కొల్లాయి గట్టితేనేమి మొదలైన వానిని చేర్చవచ్చు.

రెండవ రకం నవలలు ఆనాటి ఉద్యమానికి దోహదాలై, నిర్మాణ కార్యక్రమాలకోవకు చెందినవి. అస్పృశ్యతా నివారణ,గోవధ నిషేధము, వర్ణాంతర వివాహాలు మొదలైన వానిని చిత్రించినవి. మాలపల్లి, బలిపీఠం వంటివి ఇందుకు ఉదాహరణలు.

ఇక మూడవ పద్ధతికి చెందినవి ఆనాటి జాతీయోద్యమంలోని స్వచ్ఛందతనూ, ఈనాడు దాని పేరున నాయకమ్మన్యులు సాగిస్తున్న అవినీతినీ తులనాత్మకంగా చూపే వ్యంగ్యరచనలు. 'కీలుబొమ్మలు' వంటి నవలలు ఈ కోవకు చెందినవి.